## క్లుప్తంగా

### 'గ్రీవెన్స్'కు వినతులు


వినతులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

### రహదారి పనుల పరిశీలన


జగన్నాథపురంలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.1.23 కోట్లతో వార్డులోని పలు ప్రాంతాల్లో రహదారులు, సీసీ డ్రెయిన్ నిర్మాణాలు జరుగుతున్నాయి. సోమవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ సంగం ఆఫీస్ కూడలి నుంచి శ్మశానవాటిక మీదుగా ఉన్న జగన్నాథపురం రహదారిలో బీటీ రోడ్ నిర్మించారు. ఈ పనులను మంగళవారం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు కొనసాగించాలని కాంట్రాక్టర్‌ను ఆమె ఆదేశించారు. విఘ్నేశ్వర అపార్ట్‌మెంట్ వద్ద నిర్మాణంలో ఉన్న భవనం వద్ద రోడ్డుపై డంప్ చేసిన డెబ్రిస్‌ను తొలగించక పోవడంతో రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. కార్పొరేటర్ చొరవతో మెటీరియల్ తొలగించడంతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు.

### శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు


నక్కవానిపాలెంలో జరుగుతున్న పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు పనులు ప్రారంభించారు. పొక్లెయిన్‌తో రోడ్డు వెడల్పు చేశారు. సత్యం జంక్షన్ నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు 80 అడుగుల రహదారిగా విస్తరిస్తున్నారు. అల్లూరి కూడలి నుంచి హెచ్‌బీ కాలనీ వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. మంగళవారం ఈ పనులను సిబ్బంది పర్యవేక్షించారు.

### ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రామ్మూర్తి

సీతమ్మధార: ద్వారకానగర్‌లోని శ్రీకృష్ణ విద్యామందిర్‌లో మంగళవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ రామ్మూర్తి మాట్లాడుతూ వాహన చోదకులంతా తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించాలని సూచించారు. సిగ్నల్ వద్ద రెడ్ లైట్ వెలిగేటప్పుడు ఆగాలని, గ్రీన్ లైట్ వెలిగేటప్పుడు ముందుకు వెళ్లాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నర్మద, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పేదల చెంతకు కార్పొరేట్ వైద్యం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఉచిత వైద్య సేవలు


కేస్ షీట్, మందులు అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్, పెదకొత్తూరు, సంజీవయ్య కాలనీ–2 సచివాలయానికి సంబంధించి కప్పరాడలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా సత్ఫలితాలు సాధించిన వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేసిందన్నారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

**607 మందికి వైద్య సేవలు**

వైద్య శిబిరంలో సుమారు 607 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సనపల రాజేంద్ర తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.కామేశ్వరి, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, నాయకులు అప్పారావు, అమర్‌రెడ్డి, గురువోజీ, కుమార్, కనకరాజు, కృపా, సురేష్, అనిల్, సవరపు జయకుమార్, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

### వైద్య సేవలు బాగున్నాయి



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో దంత, గ్యాస్ పరీక్షలు చేయించుకున్నాను. దంత వైద్యశాలలో మరింత మెరుగైన పరీక్షలు చేయిస్తామని వైద్యులు తెలిపారు. వైద్య శిబిరంలో సేవలు బాగున్నాయి.
– ఎస్.త్రివేణి, రాంజీ ఎస్టేట్

### పేదలకు ఉపయోగకరం



దంతాల నొప్పితో బాధపడుతున్నాను. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యులు మంచిగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఇటువంటి శిబిరాలు మాలాంటి పేదోళ్లకు ఎంతో ఉపయోగపడతాయి.
– కె.చరణ్‌కుమార్, కప్పరాడ

### మెరుగైన వైద్యానికి భరోసా



ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు మాతో మర్యాదపూర్వకంగా మెలిగారు. ఆరోగ్య సమస్యలు చెబితే ఓపిగ్గా విని ఆరోగ్య సలహాలు, సూచనలిచ్చారు. ఆరోగ్యశ్రీ ఉన్న ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు.
– ఎస్.పద్మ, పెదకొత్తూరు

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


నివాసులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న కె.కె.రాజు, పీలా వెంకటలక్ష్మి

సీతంపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 26వ వార్డు శాంతిపురం సచివాలయం (1086127) పరిధి రామకృష్ణానగర్‌లో పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పథకాల వివరాలకు సంబంధించి కరపత్రాలను నివాసులకు అందించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గతంలో నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం పనిచేసేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజా సంక్షేమం కోసం అనేక సరికొత్త పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బులుసు జగదీష్, డైరెక్టర్ పాండవ శ్రీను, రాయుడు శ్రీను, రామలింగేశ్వర స్వామి ఆలయం చైర్మన్ బొడ్డేటి కిరణ్, 26వ వార్డు నాయకులు రేవతీరావు, నవాబ్, శేషు, అమ్మాజీ, ఎం.సునీల్, హరికృష్ణ, బాబ్ జాన్, సుశీల, రమాదేవి, గౌస్య, విజయ్ పాల్, ఫరూక్, జి.లక్ష్మి, లలిత, రాయ్, శ్యామ్, ఈశ్వరరావు, సీనియర్ నాయకులు కె.చిన్నా, గాలి ప్రసాద్, నేపాల్ శ్రీను, సంతోష్, అశోక్, రాము, జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### యోగసిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు



మురళీనగర్: సూర్యానగర్–2 జాతీయ రహదారిని ఆనుకుని వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు సుందరాకాండ పారాయణం, సాయంత్రం భజనానంద హారతి సమర్పించారు.

### పదవీ విరమణ చేసిన ఏఎస్‌ఐకు సత్కారం


రిటైర్డ్ ఏఎస్‌ఐ తులసిగిని సన్మానిస్తున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: పదవీ విరమణ చేసిన ఏఎస్‌ఐ గుత్తుల తులసిగిని మంగళవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తన చాంబర్‌లో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. 1984లో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన తులసిగి 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2018లో ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. విధి నిర్వహణలో పలు క్యాష్ రివార్డులు అందుకున్నారు. పదవీ విరమణ చేసిన తులసిగి, అతని కుటుంబ సభ్యులకు సీపీ శుభాకాంక్షలు తెలిపి పోలీస్ శాఖలో 40 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో తులసిగిని సత్కరించి వీడ్కోలు పలికారు.

# ఆధునిక గ్రంథాలయం నిర్మించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సమితి ప్రతినిధులు

సీతమ్మధార : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలంలో ఆధునిక లైబ్రరీ నిర్మించాలని కేంద్ర ఇంధన శాఖ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం పౌరులు, విద్యార్థులు, సమితి సభ్యులు, నిరుద్యోగులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ జీవీఎంసీ నుంచి గ్రంథాలయ శాఖకు చెల్లించాల్సిన బకాయి సెస్‌ను తక్షణమే చెల్లించాలన్నారు. 13 ఏళ్లుగా ఎందుకు అలసత్వం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు అండగా నిలబడాలని, స్థలాన్ని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. విద్యా శాఖ అలసత్వంపై చర్యలు చేపట్టాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే లేఖ ద్వారా ముఖ్యమంత్రికి తెలియజేశామన్నారు.

# నడక, పరుగు అలవాటు పెంచేందుకే ఫ్రీడమ్ రన్


ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న వాసీవా, ఏపీఐఐసీ ఐలా, డీఐసీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖపట్నం ఎంఎస్‌ఎంఈ – డీఎఫ్‌వో ఆధ్వర్యంలో ఏపీఐఐసీ ఐలా, వాసీవా, డీఐసీ సంయుక్తంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 4.0ను నిర్వహించాయి. మంగళవారం ఆటోనగర్ వాసీవా భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 40 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఎంఎస్‌ఎంఈ ఏడీ చంద్రమౌళి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతిల ప్రాముఖ్యతను పురస్కరించుకుని యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ 2020లో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ ప్రారంభించిందని చెప్పారు. మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ప్రజల్లో నడక, పరుగు అలవాటును పెంపొందించడమే ఈ రన్ లక్ష్యం అన్నారు. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ నాల్గవ ఎడిషన్ ఈ సంవత్సరం స్వచ్ఛ భారత్, స్వస్తి భారత్ థీమ్‌తో ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌గా అక్టోబర్ 1 నుంచి 31 వరకు నిర్వహించినట్టు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బి.ఎ.ఎ.వి.ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు ఎస్.ఎల్.ఎన్. కుమార్, వీరయ్య, రేవతి, వినోద్, సుబ్బారావు, సన్యాసిరావు, ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కోల్లి ఈశ్వరరావు, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, డీఐసీ జీఎం సీహెచ్ గణపతి, ఫ్యాప్సీ అధ్యక్షుడు మురళీ కృష్ణ, వాసీవా ప్రతినిధులు రాంప్రసాద్, పర్చూరు ప్రభాకర్, అనార్‌బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### దోమల నిర్మూలనకు ఫాగింగ్


51వ వార్డులో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో మంగళవారం దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సూచనల మేరకు వుడా కాలనీ ఫేస్ 1, 2ల్లో జీవీఎంసీ సిబ్బంది ఈ చర్యలు చేపట్టారు. కాలనీలో దోమలు ఎక్కువగా ఉండటం వల్ల ఈ కార్యక్రమం చేపట్టామని కార్పొరేటర్ తెలిపారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ నిర్వహిస్తున్నామని, పార్టీ కార్యకర్తలు జీవీఎంసీ సిబ్బందికి సహకరిస్తూ దోమల మందు ఫాగింగ్ చేశారన్నారు.

# 10 నుంచి చెకుముఖి సంబరాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి, డీఈవో చంద్రకళ తదితరులు

మధురవాడ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి చెకుముఖి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె.పరశురామ్ తెలిపారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోటాన శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేముడుబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**2న సహస్ర తులసిపూజ**

కనకమహాలక్ష్మి దేవస్థానంలో నవంబర్ 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు తెలిపా రు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

### ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వాణిజ్య విభాగం, ఐక్యూఏసీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని మాట్లాడారు. యువత ఆర్థిక లావాదేవీల నిర్వహణలో సాంకేతిక అభివృద్ధి ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుని నిత్య జీవితంలో అన్వయించుకోవడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ఎన్ఐఎస్ఎం ట్రైనర్ ఎం.శ్రీను విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు ఎస్. అనురాధ, ఎన్. నిర్మలాకుమారి, జి.నాగశాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనీయుడు వల్లభాయ్ పటేల్



సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆల్వార్‌దాస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, వాకర్స్ క్లబ్‌ల సృష్టికర్త ఆళ్వార్ దాస్‌ల జయంతి వేడుకలను వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వాకర్స్ పార్కులో ఘనంగా నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆల్వార్‌దాస్‌కు మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు తమ వందనాలు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం నేటితరానికి ఆదర్శనీయమన్నారు.

**ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ఆళ్వార్ దాస్ కృషి**

వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ మాట్లాడుతూ వాకర్స్ సభ్యులు ఆరోగ్యంతోపాటు ఆనందంగా జీవించడానికి ఆల్వార్ దాస్ స్థాపించిన వాకర్స్ క్లబ్‌లే కారణమన్నారు. వాకర్స్ ఉద్యమాన్ని, ఆరోగ్యం ప్రాధాన్యాన్ని ఆయన ప్రజల్లోకి తీసుకెళ్లి ఆరోగ్యవంతమైన సమాజం స్థాపనకు కృషి చేశారని కొనియాడారు. ముందుగా వల్లభాయ్ పటేల్, ఆల్వార్‌దాస్‌ల చిత్రపటాలకు పూర్వాధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, 101 గవర్నర్ శుభ, వాకర్స్ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వాధ్యక్షులు రాళ్లపల్లి సత్యనాథం, చిలకపాటి కృష్ణమూర్తి, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఎ.రామకృష్ణ, కార్యదర్శి ఎల్వీ సుధాకర్, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, వి.అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్, సీతమ్మధార క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం క్షత్రియ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించి వైద్య పరీక్షలను పరిశీలించారు. వైద్యులు కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, అంకాలజీ, జనరల్ మెడిసన్, ఆర్థోపెడిక్, గైనకాలజీతోపాటు ఇతర వైద్య పరీక్షలు చేశారు. అధిక సంఖ్యలో స్థానికులు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, ఎన్ఆర్ఐ హాస్పిటల్ సీఈవో చంద్రమౌళి, క్షత్రియ సేవా సమితి ప్రెసిడెంట్ శివాజీ రాజు, సెక్రటరీ వర్మ, కోశాధికారి శ్రీహరిరాజు, జాయింట్ సెక్రటరీ అంజిబాబు, వైస్ ప్రెసిడెంట్ బుల్లిబాబు, కమిటీ మెంబర్లు నాగరాజు, రాజంరాజు, కిరణ్‌రాజు, గోపి, భారతి, అభి, ప్రవీణ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సంక్షేమ బోర్డు సాధన



సీతమ్మధార జంక్షన్‌లో నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దిన వేడుకలు మంగళవారం సీతమ్మధార జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జె.వి.ప్రభాకర్ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను, ట్రేడ్ యూనియన్ హక్కులను బడా కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి కార్మికులకు ఆహార భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ పరిశ్రమలను తెరిపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. నవంబర్ 26, 27 తేదీల్లో కార్మికులు, ఉద్యోగులు, రైతాంగం చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళనకు ప్రజలు సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు. కార్మికులు, ఆటో డ్రైవర్లు సంక్షేమ బోర్డు సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి, రావికృష్ణ, దాలినాయుడు, దుర్గారావు, అద్దూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# నాకవుట్‌కు సీనియర్ వుమెన్ జట్టు


ఆంధ్ర సీనియర్ వుమెన్ జట్టు

విశాఖ స్పోర్ట్స్ : బీసీసీఐ సీనియర్ వుమెన్ క్రికెట్ నాకవుట్‌కు ఆంధ్ర జట్టు అర్హత సాధించింది. టీ20 ట్రోఫీ లీగ్ దశలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఆంధ్ర మహిళా జట్టు ఐదింట విజయాలు సాధించింది. నవంబర్ మూడో తేదీనుంచి నాకవుట్ పోటీలు ప్రారంభం కానుండగా తొలి మ్యాచ్‌లో ముంబయ్‌తో తలపడనుంది. ఈ సందర్భంగా జట్టును ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి అభినందించారు.

### జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రేష్మ ప్రతిభ


రేష్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్ తదితరులు

సబ్బవరం: జూనియర్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఎస్.రేష్మ ప్రతిభ చూపింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రా జట్టు తరఫున ఆమె ప్రాతినిథ్యం వహించింది. గోవా జట్టుతో జరిగిన తుది పోరులో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓటమి చెంది ద్వితీయస్థానంలో నిలిచింది. తుది పోరులో రేష్మ ప్రతిభ చూపి, కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చిందని ప్రిన్సిపాల్ పి.మురళీధర్ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.వి. రమణారావు, ఇతర ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.